క్లుప్తంగా

మినీ విత్తన కిట్ల పంపిణీ



రైతులకు మినీ కిట్లు అందజేస్తున్న ఎంపీపీ చంద్రశేఖర్ రెడ్డి, తదితరులు

బ్రహ్మసముద్రం: మండల వ్యాప్తంగా 14 ఆర్బీకేలకు 140 బ్యాగుల మినీ విత్తన కిట్లు మంజూరైనట్లు ఎంపీపీ చంద్రశేఖర రెడ్డి, ఏఓ సరిత, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బసవరాజు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద రైతులకు మినీ విత్తన కిట్లు పంపిణీ చేశారు. ఒక్కో ఆర్బీకేకు 10 బ్యాగుల చొప్పున పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.పూజ, మండల రైతు సంఘం అధ్యక్షుడు గోపాల్ రెడ్డి, ఎంపీటీసీ బుసప్ప, వైస్ సర్పంచ్ కొల్లప్ప, చెలిమేపల్లి ఆంజనేయులు పాల్గొన్నారు.

బియ్యం కౌంటర్ ఏర్పాటు

కళ్యాణదుర్గం: పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని బళ్లారి మిట్టపై ఉన్న మనోహర్ ప్లాజాలో ప్రత్యేక బియ్యం కౌంటర్‌ను బుధవారం ఏర్పాటు చేశారు. తహసీల్దార్ ఫణికుమార్, సీఎస్‌డీటీ సుబ్రహ్మణ్యం తదితరులు బియ్యం కౌంటర్‌ను ప్రారంభించారు. రాయితీతో సోనామసూరి బియ్యం కిలో రూ.48కే అందించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు



వివరాలు తెలుసుకుంటున్న జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ ఎస్.రామచంద్ర

శెట్టూరు: మండల పరిధిలోని కనుకూరు పాఠశాలలో 15 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసి అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. బుధవారం ఎంపీడీఓ మైథిలీ, ఎంఈఓ శ్రీధర్, ఈఓఆర్డీ రఘురాం రావు తదితరులు పాఠశాలను సందర్శించారు. అనారోగ్యానికి గురైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ రామచంద్ర పరిశీలించారు. ఫుడ్ శాంపిల్స్‌ను ల్యాబ్‌కి పంపించారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం డా.తరుణ్ సాయి పాఠశాలలో హెల్త్ క్యాంప్ నిర్వహించారు. పిల్లలకు ఎటువంటి ప్రమాదం లేదని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కావేరి, ఎంపీటీసీ నాగమణి, స్కూల్ కమిటీ చైర్మన్ కిష్టప్ప పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో జాప్యం వద్దు



మాట్లాడుతున్న నోడల్ అధికారి శంకర్

గుమ్మఘట్ట: అభివృద్ధి పనుల్లో జాప్యం వద్దని నోడల్ అధికారి, డీఎల్‌డీఓ శంకర్ తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగనన్న గృహాలు, సచివాలయాలు, ఆర్బీకేలు, విలేజ్ హెల్త్ సెంటర్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలన్నారు. ఆయా భవనాలకు కావాల్సిన ఇనుము, ఇసుక, సిమెంటును అందించామని తెలిపారు. నిర్లక్ష్యం ప్రదర్శిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరసింహమూర్తి, మండల ఇంజినీర్ లక్ష్మీనారాయణ, హౌసింగ్ ఏఈ, ఈఓఆర్డీ సురేశ్‌బాబు, ఎస్ఎస్ఏ ఏఈ సుదర్శనరెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వేంకటేశ్వర స్వామి వ్రతం



లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో వ్రతాన్ని ఆచరిస్తున్న మహిళలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో బుధవారం కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి వ్రతాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఆలయంలో శ్రీవారి ప్రతిమలు ఏర్పాటు చేసి వ్రతాన్ని ఆచరించారు. అంతకుముందు లక్ష్మీనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. అధిక శ్రావణమాసంలో ఈ వ్రతం ఆచరించడం వల్ల అధిక ఫలము, ఐశ్వర్యాలు, సకల సంతోషాలు కలుగుతాయని అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు గెల్లి రామరాజు, కోశాధికారి రాజశేఖర్‌రెడ్డి, కార్యదర్శి మధుసూదన, గౌరవాధ్యక్షుడు బండి కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆకలి తీర్చి.. ఆదర్శంగా నిలిచి



కరోనా సమయంలో భోజన పొట్లాలు అందిస్తున్న ట్రాన్స్‌జెండర్ వలంటీర్ శ్రేయదాస్ (ఫైల్)

వలంటీర్లకు వందనం

కరోనా సమయంలో పేదల జీవనం అస్తవ్యస్తంగా మారింది. కూలి పనులు చేసుకుని పొట్టపోసుకునే కుటుంబాలు పస్తులున్న సంఘటనలు చాలా ఉన్నాయి. అలాంటి తరుణంలో ఉరవకొండ పట్టణానికి చెందిన ట్రాన్స్‌జెండర్ వలంటీర్ శ్రేయదాస్ చేసిన సేవలు ఎంతో మందికి ఆదర్శంగా నిలిచాయి. రోజూ ఇంట్లోనే భోజనం వండి, వాటిని పొట్లాలుగా చేసి సచివాలయం–3 పరిధిలోని 25 పేద కుటుంబాలకు అందజేసింది. దాదాపు 25 రోజుల పాటు తన సొంత ఖర్చులతో భోజనం అందజేసిన ట్రాన్స్‌జెండర్ శ్రేయదాస్‌ను స్థానికులు మరచిపోలేరు. అలాగే కొంతమంది దాతల సహాయంతో నెల రోజుల పాటు భోజనం అందజేసి.. అందరితో శభాష్ అనిపించుకుంది. – ఉరవకొండ:

సలాం.. శ్రేయదాస్



“ కరోనా సమయంలో వలంటీర్ శ్రేయ తన వార్డులోని పేదలకు విశిష్ట సేవలందించింది. ఇంట్లోనే భోజనం వండి పేదలకు అందజేయడం సంతోషం. కరోనా సమయంలో చాలామంది డబ్బు ఉన్న వారు సేవలు చేసేందుకు ముందుకు రాలేదు. కరోనా సోకితే బంధువులు కూడా పట్టించుకోలేదు. ఆ సమయంలో వలంటీర్ శ్రేయ తన సొంత ఖర్చులతో భోజనం అందించడం హర్షణీయం. పేదల ఆకలి తీర్చిన శ్రేయదాస్‌కు సలాం చేస్తున్నాం. – షబానా, ఉరవకొండ

సేవలో మేటి మహేష్



బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న వలంటీర్ మహేష్ (ఫైల్)

ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు మహేష్. గుమ్మఘట్ట మండలం రంగసముద్రంలో వలంటీర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. కోవిడ్ విపత్తులో ఉత్తమ సేవలందించాడు. తన పరిధిలో పలువురికి కోవిడ్ సోకడంతో వారిని క్వారంటైన్ సెంటర్‌కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న వలంటీర్ మహేష్.. బాధితుల ఇళ్ల వద్దకు వెళ్లి ధైర్యం చెప్పారు. కరోనా నియంత్రణలో భాగంగా ఇంటి చుట్టూ బ్లీచింగ్ పౌడర్ పిచికారీ చేశాడు. ప్రభుత్వం సరఫరా చేసిన మందులు అందజేశాడు. అలాగే పలు కుటుంబాలకు కూరగాయలు కూడా అందజేసి, అందరితో ప్రశంసలు పొందాడు. – గుమ్మఘట్ట:

వలంటీర్ సేవలు ఆదర్శం



“ మాది రంగసముద్రం. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో వలంటీర్లు అందించిన సేవలు వెలకట్టలేనివి. కరోనా సోకినప్పుడు మమ్మల్ని ఎవరూ మాట్లాడించలేదు. వలంటీర్ మహేష్.. ధైర్యంగా ఇంటి వద్దకు వచ్చి మమ్మల్ని ఓదార్చాడు. ఇంటి చుట్టూ బ్లీచింగ్ పౌడర్ చల్లాడు. మాకు కావాల్సిన కూరగాయలను సైతం ఇంటి వద్దకు అందించి మానవత్వం చాటుకున్నాడు. మా ప్రాణం ఉన్నంత వరకూ వారి సేవలను గుర్తించుకుంటాం. – రాధమ్మ, రంగసముద్రం

వలంటీర్ కుటుంబానికి ప్రభుత్వం అండ



వలంటీర్ ధరణి కుటుంబానికి రూ.5 లక్షల చెక్కు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

ఉరవకొండ: పెద్ద కౌకుంట్లకు చెందిన వలంటీర్ ధరణి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచింది. వివరాలు.. 2021 అక్టోబర్ 19న అనారోగ్యంతో వలంటీర్ మృతి చెందింది. మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ఈ విషయాన్ని సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లారు. వలంటీర్ కుటుంబాన్ని ఆదుకోవాలని విన్నవించారు. స్పందించిన సీఎం జగన్.. సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.5 లక్షలను మంజూరు చేశారు. బుధవారం ఇందుకు సంబంధించిన చెక్కును వలంటీర్ కుటుంబ సభ్యులకు మాజీ ఎమ్మెల్యే విశ్వ అందజేశారు. నాయకులు వసంతమ్మ, మల్లికేసు, సిద్దారెడ్డి, చలమారెడ్డి పాల్గొన్నారు.

నేలకూలిన భారీ వృక్షం

ఉరవకొండ: పట్టణంలోని 5వ వార్డు జోగి బావి వద్ద బుధవారం ఈదురు గాలులకు రావి చెట్టు నేలకొరిగింది. రావి చెట్టు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాలపై పడటంతో రెండు విద్యుత్ స్తంభాలు, డీపీ ధ్వంసం అయ్యాయి. అధికారులు మరమ్మతులు చేపట్టారు.

గడప గడపలో విశేష ఆదరణ



పథకాల బుక్‌లెట్ అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

- కౌకుంట్లలో మాజీ ఎమ్మెల్యే విశ్వపై పూలవర్షం కురిపించిన గ్రామస్తులు

ఉరవకొండ: ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ సొంత పంచాయతీ పెద్దకౌకుంట్ల గ్రామంలో బుధవారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వర రెడ్డికి మహిళలు హారతులు పట్టారు. పలువురు నాయకులు పూలవర్షం కురిపిస్తూ ఘనంగా స్వాగతం పలికారు. గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు వసంతమ్మ, సిద్దారెడ్డి, మల్లికేసు, చెలమారెడ్డి, మోపిడి ఎర్రిస్వామి, శ్రీకాంత్, చిన్న ఎర్రిస్వామి, ప్రభాకర్, రామాంజినేయులు, రాము తదితరులు భారీ గజమాలతో సత్కరించారు. అనంతరం మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే నివాళులు అర్పించారు. భారీ ర్యాలీ చేపట్టి, గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే విశ్వ ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్లు అందజేశారు. పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. మరోసారి మాకు జగన్ సార్ రావాలి.. మీరు ఎమ్మెల్యేగా గెలవాలి అంటూ ప్రజలు తెలిపారు. కార్యక్రమంలో ఉరవకొండ, వజ్రకరూరు, విడపనకల్లు ఎంపీపీలు చంద్రమ్మ, దేవిబాయి, కరణం పుష్పావతి, జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, మార్కెట్ యార్డు చైర్మన్ సుశీలమ్మ, వైస్ ఎంపీపీ నరసింహులు, పార్టీ రాష్ట్ర నాయకులు తేజోనాథ్, అశోక్, మూలగిరిపల్లి ఓబన్న, కురుబ, ఎంబీసీ కార్పొరేషన్ల డైరెక్టర్లు గోవిందు, వెంకటేష్, కౌకుంట్ల వసంతమ్మ, మల్లికేసు, చెలమారెడ్డి, మాజీ ఎంపీపీ ఏసీ ఎర్రిస్వామి, భీమిరెడ్డి, భరత్‌రెడ్డి, ఎర్రిస్వామిరెడ్డి, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ మీరంబాషా, సలీం, బళ్లారి ఆసీఫ్ పాల్గొన్నారు.

చింతర్లపల్లి సర్పంచ్ చెక్ పవర్ రద్దు

శెట్టూరు: మండల పరిధిలోని చింతర్లపల్లి సర్పంచ్ గౌరమ్మ చెక్ పవర్ రద్దు చేసినట్లు ఎంపీడీఓ మైథిలీ బుధవారం ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీలో 2021–22, 2022–23 ఆర్థిక సంవత్సరాల్లో ప్రభుత్వ ఆదేశాలు పాటించకుండా ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేసినందుకు చెక్ పవర్‌ను రద్దు చేయడం జరిగిందన్నారు. సంబంధిత సర్పంచ్‌కు నోటీసులు ఇచ్చినా 45 రోజుల పాటు ఎలాంటి సమాధానం ఇవ్వలేదని తెలిపారు. దీంతో సర్పంచ్ చెక్ పవర్‌ను 3 నెలల వరకూ రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు మెమోలు

బెళుగుప్ప: మండల కేంద్రంలోని బెళుగుప్ప–2 సచివాలయాన్ని ఎంపీడీఓ రామచంద్ర బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయ ఉద్యోగుల హాజరు రికార్డులను పరిశీలించారు. ఎలాంటి సమాచారం లేకుండానే ముగ్గురు అధికారులు నిర్దిష్ట సమయానికంటే ముందుగానే వెళ్లినట్లు గుర్తించారు. వెంటనే ముగ్గురు అధికారులుకు మెమోలు జారీ చేశారు. సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు. సచివాలయ అధికారులు కార్యాలయ పని వేళలు కచ్చితంగా పాటించాలన్నారు. రోజూ మూడు సార్లు బయోమెట్రిక్ అటెండెన్స్ వేయాల్సి ఉంటుందన్నారు. ఉద్యోగులు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

‘దుర్గం అభివృద్ధికి నిధులివ్వండి’



ప్రభుత్వ విప్ కాపు కుటుంబాన్ని అభినందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

- సీఎం జగన్‌ను మర్యాదపూర్వకంగా కలసిన విప్ కాపు దంపతులు

రాయదుర్గం: నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రత్యేక నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి విజ్ఞప్తి చేశారు. బుధవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ చైర్‌పర్సన్ కాపు భారతి, కుమారుడు కాపు ప్రవీణ్‌రెడ్డితో కలిసి ముఖ్యమంత్రిని కలిశారు. పుష్పగుచ్ఛం, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రితో చర్చించిన పలు విషయాలను విప్ కాపు ‘సాక్షి’కి తెలియజేశారు. జీడిపల్లి నుంచి బీటీపీకి కృష్ణ జలాలను మళ్లించే పథకంలో కీలకంగా చెప్పుకునే భూసేకరణకు రూ.208 కోట్లు కేటాయించడం హర్షణీయమన్నారు. మొదటి ప్యాకేజీ ద్వారా రూ.135 కోట్ల నిధులు విడుదల చేసే ప్రకటనపై ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నట్టు సీఎం జగన్ దృష్టికి విప్ కాపు తీసుకెళ్లారు.

‘గడప గడపకూ మన ప్రభుత్వంపై సీఎం సంతృప్తి’

నియోజకవర్గంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంపై సీఎం జగన్ సంతృప్తి వ్యక్తం చేశారని విప్ కాపు తెలిపారు. ఇప్పటికే 80 శాతం గృహాలు పూర్తి చేశామని తెలిపారు. నెలాఖరుకు అన్ని గృహాలు సందర్శించాలని ఆదేశించారన్నారు. సీఎం ఆశయ సాధనకు కట్టుబడి గడప గడపకూ మన ప్రభుత్వం పూర్తి చేసేలా ప్రణాళికలు చేపట్టామన్నారు. నియోజకవర్గంలో కార్యకర్తలు, నాయకులను కలుపుకుని వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు వివరించారు.

సొంతింటి కలను సాకారం చేసుకోండి



మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ కేశవ నాయుడు

కూడేరు: ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాగానే వెంటనే ఆ ఇళ్లకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని గృహ నిర్మాణ శాఖ పీడీ కేశవ నాయుడు మండల అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన కూడేరు, ముద్దలాపురం గ్రామాల్లోని జగనన్న లే అవుట్లను సందర్శించారు. గృహ నిర్మాణాలను పరిశీలించారు. ఎన్ని గృహాలు మంజూరయ్యాయి? వాటిలో ఎన్ని పూర్తయ్యాయి? మిగిలిన ఇళ్లు ఏయే దశల్లో ఉన్నాయని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పునాది దశలోనే ఉన్న లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. పలవురు లబ్ధిదారులు నీటి సమస్య ఉందని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. జలజీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ కొళాయి ఏర్పాటు చేసి మంచి నీటి సౌకర్యాన్ని కల్పిస్తామని తెలిపారు. పునాది కూడా తవ్వుకోని లబ్ధిదారుల పట్టాలు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఇళ్లను తొందరగా నిర్మించుకుని సొంతింటి కలను సాకారం చేసకోవాలని సూచించారు. నిర్మాణ దశలను బట్టి వెంటనే బిల్లులు మంజూరు అయ్యేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేషారెడ్డి, ఎంపీడీఓ ఎంకే బాషా, హౌసింగ్ ఏఈ శేఖర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ ద్వారా ఆధునిక వైద్య సేవలు



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ యుగంధర్

కూడేరు: రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా గ్రామీణులకు సైతం ఆధునిక వైద్య సేవలందుతున్నాయని జిల్లా వైద్యాధికారి డాక్టర్ యుగంధర్ అన్నారు. మండల పరిధిలోని అరవకూరులో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో 104 ద్వారా అందిస్తున్న వైద్య సేవలను పర్యవేక్షించారు. 104 ద్వారా అందుతున్న వైద్య సేవలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల వద్దకే వెళ్లి మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలను తప్పనిసరిగా వేయాలని సిబ్బందిని ఆదేశించారు. గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి, సుఖ ప్రసవం జరిగేందుకు పాటించాల్సిన ఆరోగ్య సూత్రాలను వివరించాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు వైద్యాధికారి మనోజ్, డాక్టర్ మనోజ్, డాక్టర్ లక్ష్మీనారాయణ, సీహెచ్ఓ మోహన్‌బాబు, సూపర్ వైజర్ వెంకటలక్ష్మమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ జయమ్మ, ఏఎన్ఎం మాధవి, 104 డీఈఓ రాజశేఖర్ పాల్గొన్నారు.

ఆసుపత్రి అభివృద్ధికి కృషి

బ్రహ్మసముద్రం: ఆసుపత్రి అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దామని ఎంపీపీ చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆసుపత్రి ఆవరణలో మౌలిక సదుపాయాలు, రోగులకు అదనంగా బెడ్ల ఏర్పాటు, ఒక వైద్యాధికారిని నియమించాలని ప్రతిపాదించారు. నాడు–నేడులో భాగంగా ఆసుపత్రిని అభివృద్ధి చేయాలని తీర్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దాసానాయక్, ఈఓఆర్డీ వెంకట్ నాయుడు, మండల వైద్యాధికారి రాజేష్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బసవరాజు, సర్పంచులు అంజినమ్మ, జి.పూజ, శెట్టిగారి మంజునాథ్, ఎంపీటీసీ బుసప్ప, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించాలి

వజ్రకరూరు: మండలంలోని గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద కూలీలకు పనులు కల్పించాలని ఇన్‌చార్జ్ ఏపీఓ ప్రభాకర్ ఆదేశించారు. బుధవారం స్థానిక ఉపాధిహామీ కార్యాలయంలో ఉపాధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ఏపీఓ మాట్లాడుతూ.. గ్రామంలో అడిగిన ప్రతి కూలీకి పనులు కల్పించాలన్నారు. కూలీల సంఖ్య పెంచాలని ఆదేశించారు. పనుల్లో అవకతవకలు జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు.

ఇంజినీరింగ్ అసిస్టెంట్‌కు సన్మానం

వజ్రకరూరు: గడేహోతూరు సచివాలయంలో పని చేస్తూ బదిలీ అయిన ఇంజినీరింగ్ అసిస్టెంట్ కుమార్ ఆచారిని బుధవారం ఘనంగా సన్మానించారు. సర్పంచ్ సురేంద్ర, సచివాలయ కన్వీనర్ కె.పార్వతి, నాయకులు పరమేష్, తిమ్మారెడ్డి, నాగరాజు, కరిబసి, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

3,936 ప్రీ స్కూల్ కిట్ల పంపిణీ



ప్రీ స్కూల్ పిల్లలకు కిట్లను అందజేస్తున్న దృశ్యం

కంబదూరు: కంబదూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు బుధవారం ప్రీ స్కూల్ కిట్లను అందజేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి ములకనూరు గోవిందు చేతుల మీదుగా కిట్లను పంపిణీ చేశారు. అనంతరం సీడీపీఓ వనజ అక్కమ్మ మాట్లాడుతూ.. ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్తలకు 3,936 ప్రీ స్కూల్ కిట్లను అందజేశామన్నారు. సూపర్‌వైజర్లు జ్యోతి, లక్ష్మీదేవి, రాధమ్మ, సుశీలమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయండి

వజ్రకరూరు: రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలని ఏఓ మధుకర్ కోరారు. బుధవారం ఆయన మండలంలోని రాగులపాడు ఆర్బీకేను సందర్శించారు. రైతు భరోసా కేంద్రంలో రైతులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు. కొర్ర, రాగులు, జొన్నలు, ఉలవలు, అలసందులు, ఆముదం తదితర పంటలు సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

‘ఓటర్ జాబితాలో మార్పులు, చేర్పులకు శ్రీకారం’

రాయదుర్గం: ఈనెల 21 నుంచి ఆగస్టు 21వ తేదీ వరకూ ఓటర్ జాబితాపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ మారుతి, ఎన్నికల డీటీ సుజాత బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నెల రోజుల పాటు బూత్‌లెవెల్ అధికారితో డోర్ టూ డోర్ వెరిఫికేషన్ చేయిస్తామన్నారు. చేర్పులు, మార్పులు, తొలగింపులపై పరిశీలన ఉంటుందన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో ఈనెల 20న రాజకీయ పార్టీలతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామన్నారు.

ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కూడేరు: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్–ఆర్డీటీ ఫీల్డ్ కార్యాలయం మధ్యలో బుధవారం అనంతపురం–బళ్లారి ప్రధాన రహదారిపై ద్విచక్ర వాహనం అదుపు తప్పిన ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలు.. వన్నూరు స్వామి ముద్దలాపురం నుంచి భార్య, కుమారుడు, కుమార్తెతో కలిసి అనంతపురం బయలుదేరాడు. ద్విచక్ర వాహనానికి కుక్క అడ్డు రావడంతో వన్నూరు స్వామి, అతడి కుమారుడు మదన్‌సాయి గాయపడ్డారు. వీరు స్థానిక ఆస్పత్రిలో చికిత్స పొందారు.

బాధ్యతలు స్వీకరించిన వీఆర్వోలు

కూడేరు: మండల పరిధిలోని కమ్మూరు వీఆర్వోగా రామకృష్ణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన బెళుగుప్ప మండల నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. అదే విధంగా కొర్రకోడు వీఆర్వోగా నాగన్న బాధ్యతలు చేపట్టారు. ఈయన వజ్రకరూరు మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వీఆర్వోలు తెలిపారు.

వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

రాయదుర్గం రూరల్: మండలంలోని కెంచానపల్లి, వేపరాల, ఆవులదట్ల గ్రామాల్లో ఖాళీగా ఉన్న 3 వలంటీర్ పోస్టులకు బుధవారం ఇంటర్వ్యూలు జరిగాయి. అయితే కెంచానపల్లి గ్రామానికి చెందిన అభ్యర్థి మాత్రమే ఇంటర్వ్యూకు హాజరైనట్లు ఎంపీడీఓ కొండయ్య తెలిపారు. వేపరాల గ్రామం నుంచి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థి ఇంటర్వ్యూకు గైర్హాజరయ్యాడు. ఆవులదట్ల నుంచి దరఖాస్తులు రాలేదని పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు నిర్ణయించిన తేదీల్లో ఆయా గ్రామాలకు తిరిగి నోటిఫికేషన్ ఇస్తామన్నారు.

జగనన్న కాలనీల్లో తాగునీటి సౌకర్యం

కుందుర్పి: మండలంలోని జంబుగుంపల, కుందుర్పి, ఎనుములదొడ్డి పంచాయతీల్లోని జగనన్న కాలనీల్లో బుధవారం సర్పంచులు గంగాధర, మారుతేశ్వరి, వరలక్ష్మి తదితరులు బోరుబావులు తవ్వించి తాగునీటి సౌకర్యం కల్పించారు. కాగా ఇప్పటికే తెనగల్లు, మలయనూరు తదితర పంచాయతీల్లోని జగనన్న కాలనీల్లో తాగునీటి వసతి కల్పించారు.

ట్రాక్టర్ బోల్తా: ఇద్దరికి గాయాలు

కంబదూరు: మండలంలోని చెర్లోపల్లి–గొల్లపల్లి గ్రామాల మధ్యలో బుధవారం రాత్రి ఓ ట్రాక్టర్ బోల్తా పడింది. వివరాలు.. గొల్లపల్లి గ్రామానికి చెందిన ఓ ట్రాక్టర్ ములకనూరు నుంచి గొల్లపల్లి గ్రామానికి వెళ్తోంది. చెర్లోపల్లి–గొల్లపల్లి గ్రామాల మధ్యకు రాగానే అదుపు తప్పి బోల్తా పడింది. ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న చెర్లోపల్లికి చెందిన నారాయణప్ప, తిమ్మన్న తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108 సిబ్బంది దాదాపీర్, జనార్దన్ కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. తిమ్మన్న పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

భూ సమస్యలు పరిష్కరించాలి

కూడేరు: మండలంలో అనేక మంది దివ్యాంగులు భూ సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని ఏపీ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఉమ్మడి జిల్లాల కో–ఆర్డినేటర్ హరినాథ్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆ సమితి నియోజకవర్గ అధ్యక్షుడు అల్లావుద్దీన్, మండల అధ్యక్షుడు సూర్యప్రకాష్ తదితరులు తహసీల్దార్ శేషారెడ్డిని కలిశారు. అన్ని విధాలా భూ హక్కు పత్రాలు ఉన్నప్పటికీ కొంత మంది దౌర్జన్యంగా భూ ఆక్రమణకు పాల్పడుతున్నారన్నారు. క్షేత్రస్థాయిలో విచారణ జరిపి దివ్యాంగులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం దివ్యాంగుల హక్కుల చట్టం–2016 పుస్తకాన్ని ఆవిష్కరించారు.

పేదలకు వరం జగనన్న సురక్ష



గరుడచేడులో సర్టిఫికెట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

గుమ్మఘట్ట: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలన్నదే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎంపీపీ భవాని, వైస్ ఎంపీపీ రామకృష్ణారెడ్డి తెలిపారు. పూలకుంట, రంగసముద్రం గ్రామాల్లో బుధవారం జగనన్న సురక్ష శిబిరాలు జరిగాయి. పూలకుంటలో 247 మందికి, రంగసముద్రంలో 213 మందికి ఉచితంగా సర్టిఫికెట్లను అందించారు. సర్పంచ్ రాధమ్మ, ఎంపీడీఓ నరసింహమూర్తి, తహసీల్దార్ బ్రహ్మయ్య, ఈఓఆర్డీ సురేశ్‌బాబు, ఆర్ఐ చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ ముసలరెడ్డి పాల్గొన్నారు.

కణేకల్లు: జగనన్న సురక్ష పేదలకు వరం లాంటిందని తహసీల్దార్ రజాక్‌వలీ, మాజీ ఎంపీపీ రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. గరుడచేడులో సర్పంచ్ వన్నూరు స్వామి అధ్యక్షతన 173 మందికి సర్టిఫికెట్లు అందజేశారు. ఎంపీటీసీ వంద్రయ్య, ఈఓఆర్డీ గూడెన్న, ఆర్ఐ అశ్వర్థనారాయణ పాల్గొన్నారు.